# ఎర్నింగ్ వైఫ్

– కె. రామలక్ష్మి

ఆఫీసులో మంచి ఎగ్జిక్యూటివ్ పోస్టులో వున్న శాంతికి ఎప్పుడు బాస్‌గారు కబురంపినా భయమే. రూల్సు తెలుసు, రెగ్యులేషన్స్ తెలుసు, యూనియన్ వుంది. తననేం ఉద్యోగంలోంచి తక్షణం పీకేస్తాడా? అయినా బాస్ కబురనే సరికి కాస్త జంకు. ఛ వెధవ ఆడ పిరికితనం అని తనని తనే ఎప్పుడూ హెచ్చరించుకుంటుంది. ఉలిక్కి పడుతూనూ వుంటుంది.

మధ్యాహ్నం లంచ్‌కి కాస్త ముందు 'అమ్మా అయ్యగారు పిలుస్తున్నారు' అని రాములు చెప్పగానే ఒక్కసారి కంగారు పడబోయి ఆగింది. 'పద వస్తున్నా' అని అతని వెనక ఆఫీసరుగారి గదిలోకి అడుగు పెట్టింది. సుందరంగా, హాయిగా వుంది ఆయన గది.

"కమిన్ మిసెస్ శాంతా, మీకో గుడ్‌న్యూస్ చెప్పాలని కబురు పంపాను. లాస్ట్ మంత్ ఢిల్లీ వెళ్ళాను గుర్తుందా, అప్పుడిక్కడ సీనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టు 'శాంక్షన్' అయింది. దానికి మిమ్మల్ని సూచించాను. అనుభవం వుంది. ఆఫీసు రొటీన్ తెలుసు, పైగా ఓర్పు ఎక్కువ. నల్గురినీ ఒక తాట నడిపించగల చాకచక్యం వుందని నా నమ్మకం. ఈ రోజునా సూచన ఓకె చేస్తూ మీకు ఆర్డర్ పంపారు. మీకు అభినందనలు" అన్నాడు. చెంపల దగ్గర కాస్త నెరసినా వయస్సు బాగా ముదిరినా చాలా చలాకీగా వుండే బాస్ అంటే ఆఫీసులో అందరికీ కాస్త ఇష్టమే.

"థాంక్యూసార్ ఇంతకంటే నేనేం చెప్పగలను?" ఉక్కిరిబిక్కిరి అయిపోతూ అంది శాంతి.

"ఇక మీరు సీనియర్ ఎగ్జిక్యూటివ్. ఆఫీసు చూసుకోవడం మీ పని. దాని వ్యవహారాలు నాకు తెలియచేయడం మీ బాధ్యత. మీలాంటి అనుభవజ్ఞులుంటే అదే సౌకర్యం - బాస్‌పై భారం తగ్గుతుంది. ఇక నెక్స్ట్ స్టెప్ డిప్యూటీ డైరెక్టరే" నవ్వుతూ అన్నారాయన.

'ఈ పులుసుతో ఈ ముద్ద దిగనివ్వండి' అనాలను కుంది శాంతి. గొంతులోంచి మాట పెగలడం లేదు.

ఇబ్బందిగా కూర్చుంది.

"మీరు వెళ్ళవచ్చు" అన్నాడాయన.

'థాంక్యూ సార్. మీ గుడ్‌విల్ లేకపోతే నాకీ ప్రమోషన్ వచ్చేదా?" అంటూ ఎలాగో ఆ గదిలోంచి బయటపడింది.

నుదుట ముచ్చెమటలు పోశాయి. అలా వస్తున్న శాంతిని చూసి "ఏమైంది? బాస్ చిల్లర పంచాడా?" ఆత్రంగా కొలీగ్స్ అడిగితే నవ్వి,తల అడ్డంగా వూపింది.

"మరి?"

"ప్రమోషన్" అంది. ఆ గొంతు నూతిలోంచి వస్తున్నట్టుగా వుంది గానీ ఉత్సాహం ఉరకలు వేస్తున్నట్టు లేదు.

"మైగాడ్! నీవాలకం చూసి తిట్టిపంపాడనుకున్నాం. అయితే రేపు మేం ఎవరం లంచ్ తెచ్చుకోం అది నీ వంతు. తప్పించుకోకు 'మా వారు ఒప్పుకోరు' అంటూ –" ఓ కొలీగ్ హెచ్చరించింది.

అంతే లంచ్‌కి ఎవరి దారిన వారు వెళ్ళారు. ఈ సంగతి తక్షణం ఫోనుచేసి కృష్ణమూర్తికి చెప్పాలని కాస్త ఆగింది శాంతి. ఫోనుచేసి కృష్ణమూర్తి ఆఫీసు నెంబరు తిప్పి అలాగే ఆగిపోయింది. ఎలా చెప్పాలి? తన జీతం బాగా ఎక్కువ అవుతుంది. హోదా కూడా బాగా పెరుగుతుంది. కృష్ణమూర్తి జీతంతో సమంగా అయిపోవడమే కాక ఇంటి అద్దె ఎలవెన్సు బాగా పెరుగుతుంది. ఈ న్యూస్ కృష్ణమూర్తికి సంతోషం కలిగిస్తుందా? కాస్త అనుమానంతలెత్తి ఫోను పెట్టేసింది. చాలా సేపు దానికేసే చూస్తూ కూర్చుంది. మనసులో పెల్లుబికిన సంతోషం కాస్తానీరుకారి పోయినట్టయింది. నిజానికి జీతం పెరిగినందుకు సంతోషించాలి - కాస్త పెద్ద ఇంట్లోకి వెళ్ళొచ్చు. మరీ డొక్కయిపోయిన కారు మార్చుకోవచ్చు. ఇంకా చిన్న చిన్న సౌకర్యాలు దశలవారీగానైనా సమకూర్చుకోవచ్చు. కానీ... కానీ... ఆలోచన ఒక కొలిక్కి రావడం లేదు శాంతికి.అయినా ఎదుటపడి చెప్పడం కంటే ఫోనులో చెప్పడమే కాస్త తేలికైన పని అనుకుని తిరిగి కృష్ణమూర్తి ఫోను నెంబరు తిప్పింది. తక్షణం అవతలవైపు ఫోను ఎత్తాడు కృష్ణమూర్తి - ఫోన్ రింగ్ కావడం కోసమే వెయిట్ చేస్తున్నట్టు.

"ఏమండీ, మీకో శుభవార్త తక్షణం చెప్పాలని" కాస్త వూపిరి బిగపట్టింది శాంతి. ఫోన్‌లో అవతలి వ్యక్తి ముఖం టి.వి.లో బొమ్మలా కనిపిస్తే ఎంత బాగుండునో కదా అనుకుంది, తను కనబడకుండా అతని ముఖ కవళికలు కనిపెట్టవచ్చునని కాబోలు సాధారణంగా శాంతికి కృష్ణమూర్తి మనోభావాలు అతని ముఖం చూస్తే తెలిసిపోతాయి. ఆరేళ్ళ సంసారం తరువాత ఆడదాని కామాత్రమైనా తెలియదా?! మాట్లాడుతున్న దేమైనా అతని ముఖంలో అసలు ఫీలింగ్స్ తెలిసిపోతాయి. చెప్పేది నచ్చితే అతగాని పెదవులో విధంగా కదులుతాయి. అంతేకాదు,నచ్చనిదైతే అతని కనుబొమ్మలు ఓవిధంగా వంగుతాయి!

"నాకు ప్రమోషన్ వచ్చింది. జీతం బాగా పెరగడమే కాదు సౌకర్యాలు కూడా"

ఒక్క క్షణంపాటు నిశ్శబ్దం తరువాత 'ఓ అలాగా!' అన్నాడు.

'ఓ అలాగా అంటే ఎలా! సాయంత్రం ఇలా వచ్చి నన్ను 'దక్షిణ్‌కి తీసుకువెళ్ళాలి!' ఉత్సాహంగా ఆర్డర్ వేసింది.

'నీ ఇష్టం. ఆరు గంటలకి వస్తా' అంటూ ఫోను పెట్టేశాడు కృష్ణమూర్తి.

కాసేపు ఫోనింకా పట్టుకునే కూర్చుంది. 'ఛ ఇంటికి వెళ్ళాక చెప్పివుండవలసింది' అనుకుంది - తొందర పడ్డానేమో అనిపించి -

సాయంత్రం అవుతున్న కొద్దీ శాంతిలో అశాంతి పెరిగిపోయి తుపానులోలా కొట్టుకొంటూంది శాంతి మనసు ఎందుకో తెలియకుండానే. 'భార్య కింత పాటి చిన్న అదృష్టం కలిసి వస్తే కించపడతాడా భర్త' నా అనుమానంగానీ... అని మనసుకి నచ్చ చెప్పుకుంది. అందరూ వెళ్లి పోయారు. కృష్ణమూర్తి రాక కోసం ఆఫీసు మెట్ల మీద నిలబడి ఎదురు చూస్తూంది శాంతి.





** ** **

"హల్లో... ఎలా వుంది పై మెట్టు ఎక్కేసరికి!" అంటూ కారు తలుపు తెరచాడు కృష్ణమూర్తి. "జీతం

పెరగ్గానే సరా! టాక్సులూ పెరుగుతాయి కదా?'' అంటూ తలుపు కావలసిన కంటే కాస్త గట్టిగానే వేశాడు అనిపించింది శాంతికి.

దారిపొడుగునా పెరిగిన బాధ్యత లెలా భారం పెంచుతాయో చెప్తూ 'అరే నెక్స్టు డిప్యూటీ తరువాత ఇంక సంస్థ డైరెక్టరు వైపోతావు! రెండే మెట్లు పెద్ద కుర్చీకి!'' కాస్త తేలికగా కొట్టి పారేస్తున్నట్టు అంటున్నాడా?



''ఆ ఆరెండు మెట్లు ఎక్కడానికింకో పదేళ్ళు పట్టవచ్చు?'' అంది తాపీగా శాంతి. ఆమె మనసు ఏమి ఆలోచిస్తూందో - అర్థం కావడం లేదామెకి.

'దక్షిన్'లో టిఫిన్ తినడం ఇప్పుడు ఫ్యాషన్. అందుకే అక్కడికి వెడదాం అంది. కాని తీరా కారు లోపలికి వెళ్ళాక తోచింది. టేబుల్ దొరకదేమో! ముందు బుక్ చేసి వుండాలేమో.

''సారీ సర్ ఒక్క టేబుల్ కూడా లేదు'' అన్నాడు. నెత్తిన వున్న మూరెడు కాప్ వంగితే పడుతుందన్న భయంతో అసలు వంగకుండా.

''సరి... ఏంచేస్తాం'' అంటూ వెనక్కి తిరిగాడు కృష్ణమూర్తి ఏ పి.ఎం. ఫ్రెండువో, పి.ఎం. చుట్టావో అన్నంత ధీమాగా వాడివి గదమాయించి టేబుల్ అడిగి వుండవచ్చు కృష్ణమూర్తి! శాంతి కాస్త ముందుకి వచ్చి ''ఎలాగైనా ఓ టేబుల్ కావాలి మా ఇద్దరికి. మేం సెలబ్రేట్ చేసుకుందుకని అనుకోకుండా ఈ రెస్టారెంట్‌కి వచ్చాం...'' అంది ఎంతో 'డిస్సపాయింట్‌మెంట్'ను దాచుకుంటున్నట్టు శాంతి.

''ఓ జెస్ట్ లెట్ మి సీ'' అంటూ టోపీగాడు లోపలికి వెళ్ళాడు... రాయిలాంటి అతని ముఖంలో చిరునవ్వు సన్నని రేఖలుపరచింది.

ఓ పది నిమిషాల్లో వచ్చి 'దిస్ వే ప్లీజ్' అంటూ ఓ టేబుల్ దగ్గరకి దారి చూపించాడు.

'థాంక్యూ అంటూ కూర్చుంది శాంతి. కృష్ణమూర్తి

కూర్చున్నాడు. కూర్చుంటూనే 'ఫరవాలేదే! అప్పుడే సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లా నటించడం వచ్చేసింది'' అన్నాడు నవ్వి.

అతని నోరు మాట్లాడుతున్నా అతని కనుబొమ్మలు చిట్లించి వున్న తీరు అసలు నచ్చలేదు శాంతికి... ఏమో 'నేను నోరుమూసుకుని అతని వెనుక తిరిగి వెళ్ళి పోవలసిందేమో' అనుకుంది శాంతి.

'మెను' కార్డు బంగారు కుచ్చు కట్టేవుంది. ఎంతో గౌరవంగా రెండు తెచ్చి బల్లమీద పెట్టి వెళ్ళాడు.

'ఏం తిందాం?' అడిగింది.

'నీ పార్టీకదా నీ ఇష్టం!' అన్నాడు చూస్తూనే.

'అబ్బ ఎన్ని రకాల దోసెలు - ఎన్ని రకాల చట్నీలు. కొంపతీసి దోసెకి వేరు, చెట్నీకి వేరు బిల్లు వెయ్యడు కదా' కిసుక్కున నవ్వింది - కాస్త వాతావరణంలోని గాంభీర్యం తగ్గుతుందేమోనని.

ఒక్కసారి తీక్షణంగా ఆమె ముఖంలోకి చూశాడు కృష్ణమూర్తి.

'నాకు మసాలా దోసె చాలు' అన్నాడు.

''ఇదేదో బనానా దోసెట. ఎలా వుంటుందో చూస్తా. తైరు వడ తిందురూ?''

''వద్దు నాకు. నీకు కావలిస్తే తిను'' అన్నాడు. మెను కార్డు బల్లమీద పడేస్తూ...

వైటర్ రాగానే ఆర్డరిచ్చింది. అతగాడు మెనూ కార్డులు చంక కింద పెట్టుకు చక్కా పోయాడు. వాటిని వున్న బంగారు కుచ్చుల కదలాడుతూ కనిపిస్తున్నాయి.

''వీడి డ్రస్సుకీ, ఆ కుచ్చులకీ కూడా మన బిల్లులో పడ పోతుంది కదండీ! లేకపోతే దోసె తొమ్మిది రూపాయిలేమిటి?' ఏదో మాట్లాడాలి కద - లేకుంటే చుట్టూరావాళ్ళు దెబ్బలాడుకుని వచ్చారనుకునే ప్రమాదం వుంది మరి.

''ఈసారి ఇలాంటి చోటికి మాటేసుకు రావా లేమో... నాలాంటి మామూలువాళ్ళని రానిచ్చేట్టు లేరిక్కడ!'' కాస్త వ్యంగ్యంగా అన్నాడు కృష్ణమూర్తి.

వీడు దోసె ఎంత సేపటికి తెస్తాడో... త్వరగా తెస్తే బాగుండును అనుకుంది శాంతి. ఇలాంటి చోట్ల చాలా ఆలస్యం చేస్తారు. వచ్చినవాళ్ళు కబుర్లాడుకుందుకు వస్తారని వాళ్ళ ఉద్దేశం. కాని మాలాంటి వాళ్ళు వస్తారని వూహించలేరు కదా పాపం! అనుకుంది. ఓ ముప్పయి నిమిషాల తరువాత కృష్ణమూర్తి దోసె శాంతి తైరువడ వచ్చాయి... 'మీ బనానా దోసె రెడీ అవుతోంది' అన్నాడు అదో యాగంలాగ!

''కానివ్వు...'' అని తను బ్రొంచుకు తినడం ప్రారంభించాడు కృష్ణమూర్తి.

శాంతికి తైరువడ మీద మంచి మనసు మాయమై పోయింది. కాని ఆర్డరు ఇచ్చాను కదా అని తినడం ప్రారంభించింది. ఓ ముక్క నోట్లో వేసుకుందో లేదో అంతా పచ్చిపిండి లోపల! అలాగే పెట్టేసింది.

కృష్ణమూర్తి 'ఏం బాగులేదా' అని అడుగుతాడను కుంది.

## ఓ జగతీ!!



నసువుకత్తెలా మెరిసే
నడుమంతర సిరి కోసం
తనువు నిలువునా స్వార్థం
తాండవ నృత్యం చేస్తూ
కన్నతల్లి ఆశలనే
కాళ్ళ కింద తొక్కిపెట్టి
స్వామిత్వపు గగనంలో
స్వైరవిహారం చేసే
దండధరుల గుప్పిట్లో
దమనమైన ఓ జగతీ!!

కాలువ పక్కన పచ్చిన
కళ్ళులేని ముసలిదాని
కడగండ్లే తెరటాలై
కవి వూహా లోకంలో
కదలుకొన్న నర్మదలా
కంచుమించుగా సాంగే
కవితా ఝరి గుండెల్లో
ప్రణవంలా ప్రభవించే

పతితుల శంఖారావం
విధాతాజ్ఞగా తలకొని
వినితీరాలింక నీవు!
జగతీ! ఓ జగతీ!! ఇక
నిరీక్షించు నిర్ఘాతం!
జడులిట చేతనులై నీ
జన్మ తరిస్తుందిప్పుడు...
రాబోయే విప్లవమే
రైతుల పాలిటి స్వర్గం...
కాబోయే స్వర్గంలో
కార్మికులే రారాజులు...
జనవాక్యం కర్తవ్యం
జనశక్తికి జయం నిజం...
నియంతలకు అంతశయ్య
నిర్మించను జన్మించిన
పతితులు పరమేశ్వరులై
కవుల కలలు పండుతాయి
జగతీ! ఓ జగతీ!!
ఇక ప్రతిష్ఠించు ప్రజాధ్వజం!!

ఏల్చూరి విజయరాఘవరావు

ఎలాగైనా వెయిటర్ దృష్టిని ఆకర్షించి పిలిచి ఇదేమిటి? అని అడుగుతాడనీ, అడగాలనీ అనుకుంది.

ఉహూ- అదేం లేదు. 'ఏమిటా ఫేస్, మాట్లాడ కుండా తిని పోక!' అన్నట్టు చూశాడు శాంతి కేసి. కుర్చీలో కాస్త అటునుంచి ఇటు కదిలాడే అతని వాలకం చూస్తే కుర్చీకి ఎవరైనా తాళ్ళేసి అతగాడిని కట్టేశారను కుంటారు. బలవంతపు బ్రాహ్మణార్థంగా వుంది వాలకం. శాంతికి కుతకుతలాడి పోతోంది మనసు. అంత డబ్బు పోసి తినకుండా వదిలేయడానికి మనసు ఒప్పడం లేదు. పళ్ళెంలో తైరువడకి బదులు ఐదు రూపాయిల నోటు కనిపిస్తూంది. అంతే! ఓ నిర్ణయానికి వచ్చినట్టు చుట్టూ కలియ చూసింది. వైటర్ ఆమె వైపు చూడ్డం తటస్థించింది. ఇటు రమ్మని పిలిచింది. 'ఎస్ మేడమ్' అంటూ వచ్చి వాలాడు వాడు.

''ఇదేం తైరువడ? వేగలేదు. లోపల అంతా పచ్చి పిండి'' అంది నవ్వుతూనే.

'కొత్త ప్లేటు తెస్తా మేడమ్, సారీ, వెరీ సారీ'' అంటూ హడావిడిగా ముందు ప్లేటు అందుకు చక్కా పోయాడు. చుట్టూ కస్టమర్స్ ఈ గొడవ వింటారని వాడి భయం వాడిది!

కృష్ణమూర్తి ఓ కనుబొమ్మ ఆశ్చర్యంగా పైకి లేపి 'తెలిసింది నీ అథారిటీ' అన్నట్టు చూశాడు శాంతిని.

వైటర్ ఇంకో ప్లేటు, బనానా దోసె కూడా పట్టు కొచ్చి పెట్టాడు. అతని ముఖంలో చిరునవ్వు అలాగే వుంది.

''చిన్నముక్క రుచి చూస్తారా!' ఇవ్వబోతూ అడిగింది.

అక్కర్లేదన్నట్టు తలూపాడు.

తల వంచుకు తినడం ప్రారంభించింది.

కాఫీ కూడా ముగించేసరికి వాతావరణం చాలా దట్టమైన తుపాన్‌కి సూచనగా తయారయింది.

బిల్లు ఇచ్చేసి బయటకి నడిచారిద్దరూ.

''నువ్వు తోలుతావా?'' కారు తాళం అందిస్తూ అడిగాడు.

''ఎందుకు? మీరే తోలండి. ఎదురు దీపాలలా వస్తుంటే నాకు భయం'' అంది.

''ఆఫీసుకు రేపటి నుంచీ కారులో వెళ్ళవా మరి?'' అడిగాడు. ఆ అనడం తీరులో హేళన స్పష్టంగా వినిపించింది శాంతికి.

తాళం లాక్కుని కారు డ్రైయివింగ్ సీటులో ఎక్కి కూర్చుంది. నా జీతం పెరిగింది -నేనింక డ్రయివరు సీటులోకి రావాలనుకుంటున్నానన్న మాట అనుకుంది కసిగా.

చాలా కాలమైంది కారు తోలి. ఎప్పుడూ ఆ అవకాశం ఇవ్వడు కృష్ణమూర్తి. 'ఆడది కారు తోలితే కారు నాశనం అయిపోతుంద'ని అతని గట్టి నమ్మకం.

మౌనంగా కళ్ళు మూసుకుని తల సీటుకి జేరవేసి పడుకున్నాడు కృష్ణమూర్తి.

''హు ఎన్ని పన్లు చేయలేదు! సోఫా కొన్నప్పుడు కుషన్లతో కొన్నవి అవి లేకుండా పంపితే దెబ్బలాడి తెచ్చింది నేను. కొత్తగా వచ్చిన ఫ్లాట్ కిటికీలోపట్టాన మూయబడకపోతే ఓనర్‌తో దెబ్బలాడి సరి చేయించింది నేను! ఎక్కువ బిల్లులని పోరాడి తగ్గించేది నేను. ఎంత ఓర్వలేని తనం. నాకు ప్రమోషనొస్తే తనకి వచ్చినట్టే

కదా! తనికి వచ్చినప్పుడు నేనెంత సంతోషించాను. మరచిపోయారా! ఈ మాత్రం సభ్యత భార్యని కనుక నాపట్ల చూపక్కర లేదు కాబోలు! ఛ! ఈ మొగాళ్ళింతే. వారి గెలుపు వారి గెలుపే, భార్యల గెలుపు వారి గెలుపే అందుకు భార్యలు గర్వపడకూడదు. సంతోషం ప్రదర్శించకూడదు. గర్వంగా 'ఫీల్' కాకూడదు. జీతం రాళ్ళు మాత్రం తెచ్చి పోయాలి. మండి పడుతున్న మనస్సుతో కారు స్పీడెక్కించింది శాంతి. కసి అంతా చేతిలో వున్న స్టీరింగు మీద చూపిస్తోంది. ఎంత గట్టిగా పట్టుకుందంటే వేళ్ళు నొప్పి పెట్టేంతగా. తరువాత ఏం జరిగిందో తెలిసేసరికి కారు లాంప్ పోస్టుకి కొట్టి ఆగింది. ఉలిక్కి పడిలేచాడు కృష్ణమూర్తి. 'ఏమైంది?' అంటూ -

శాంతి మాట్లాడలేదు. ఇంజను పొగలు కక్కుతోంది. బంపరు బాగా దెబ్బతిని వుంటుంది. రేడియేటరు పగిలి నీళ్ళు కారిపోతూ వుంటాయి - అనుకుంటూ జవాబు చెప్పలేదు శాంతి.

'ఏమైంది నీకు? నీ కసలీ జన్మకి డ్రయివింగు రాదు' అంటూ తలుపు తీసుకు దిగాడు కారుకు తగిలిన దెబ్బలు చూడ్డానికి.

''నీక్కావలసిందీ అదేగా' గట్టిగా అరవాలని, కారు తలుపు తెరచుకుని దిగి ధబేలున వేసి, వెనక్కి తిరిగి చూడకుండా నడిచి పోవాలని అనిపించింది శాంతికి.

## ఏకాంతం

నేస్తం —
జీవితం ఓ ఒంటరి పయనం
కరడుకట్టిన ఏకాంతం!
చీకటే ఎక్కువ భాగం
వెలుతురు ఒక్క త్రుటికాలం!
కాదేదీ నీకు సొంతం
అంకితమన్నదంతా అబద్ధం!
జగమంతా దగా, మోసం
నీవారెవ్వరూ కారు నీ కోసం!
బంధాలూ బాంధవ్యాలకు లేదిక్కడ అర్థం
అనురాగాలూ, ఆప్యాయతలూ వ్యర్థం, వ్యర్థం!
నేటి నగటు మనిషే రూపొందిన స్వార్థం
అందుకే నేస్తం, వెచ్చించకు నీ మహోన్నత త్యాగం!!

— ఝాన్సీ కె.వి.కుమారి

''దిగు, ఇది ఇక్కడే లాక్‌చేసి ఎ.ఎ.ఎస్.ఐ.కి చెప్పి వెళ్ళాలి'' అన్నాడు కృష్ణమూర్తి.

తలుపు తెరచి దిగి దభేలున వేసింది.

ఇద్దరూ పేవ్‌మెంట్ మీద నిలబడ్డారు ఖాళీ ఆటో కోసం.

''మీ కంటే ఓ రెండు రూపాయిలు జీతం ఎక్కువ అని, మీలా కాకుండా కాస్త మంచి మాటలతో చాకచక్యంగా పనులు సాధించగలననీ, మీరు నన్నేం అనుకుంటున్నారు? మగరాయుడి నైపోయి మీలాగే సాధించి పోస్తాననుకుంటున్నారా? లేక మీలా వేరే ఎకౌంట్ ప్రారంభిస్తాననుకుంటున్నారా? ఏమిటి మీ ఉద్దేశం? నేనంత సంతోషకరమైన వార్త ఏ పక్కవారికి చెప్పినా మీ కంటే ఎక్కువే ఆనందించి వుందురు. నాదే బుద్ధి తక్కువ. నా కొలీగ్సు పంచుకున్నట్టు నా సంతోషం మీరెందుకు పంచుకుంటారు? మీరు తాళి కట్టిన వారు కదా! ఎలా పంచుకుంటారు? మీకంటే చాలా విషయాలలో నేను మెరుగే. అంతమాత్రాన?'' ఒస్తున్న దుఃఖాన్ని అదిమిపట్టి... ఖాళీగా వస్తున్న ఆటోని ఆపడానికి ఓ అడుగు ముందుకేసి ఆగిపోయింది శాంతి.

''మీరే ఆపుకోండి - లేకుంటే ఇదో గొడవ!'' అంది కసిగా.

కృష్ణమూర్తి ఆటో ఆపాడు ''మీటరు మీద రెండు రూపాయిలు'' అంటూ వాడు మీటరేశాడు. మాట్లాడకుండా ఎక్కి కూర్చుంది. ఆమె ననుసరించాడు కృష్ణమూర్తి.

అతని మనసిప్పుడు సడెన్‌గా తేలికైనట్టుంది. తన అసలు బాధ శాంతి గుర్తించినందుకు.

మగవాడు 'నీ హోదా నాకు బాధ' అని నోరు విడిచి ఎలా చెప్పగలడు? అంటూ నిట్టూర్చాడు.

''తిన్నగా వెళ్ళి జంక్షన్‌లో రైట్‌కి తిరుగు'' అని చెప్పి హాయిగా కూర్చున్నాడు కృష్ణమూర్తి.

వద్దనుకున్నా కళ్ళు వర్షించడం ప్రారంభించాయి శాంతికి.

